క్లుప్తంగా

గర్భిణులకు వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఎమ్మిగనూరుటౌన్: మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని రేఖ నర్సింగ్ హోంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు రేఖ సింధూరి మహిళలకు వైద్య సేవలందించారు. 35 మంది గర్భిణులకు సీపీబీ, ఆర్‌బీఎస్, సీయుఈ, టీఎస్‌హెచ్ పరీక్షలను నిర్వహించి ఆ మేరకు వైద్యం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీ వరకు ఉచిత వైద్య శిబిరం కొనసాగించనున్నట్లు వెల్లడించారు.

15 మందిపై బైండోవర్ కేసులు

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం 15 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ మస్తాన్‌వలి తెలిపారు. అలాగే మండలంలో 5 మందిని బైండోవర్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సునీల్‌కుమార్ చెప్పారు. పాత నేరస్తులు, నేర ప్రవృత్తి కలిగిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని పట్టణ, రూరల్ ఎస్‌ఐలు పేర్కొన్నారు.

హోలీ సంబరాలు



కోయిలకొండలో హోలీ సంబరాల్లో చిన్నారులు

నందవరం: మండల కేంద్రం నందవరంతో పాటు నాగలదిన్నె, ముగతి, ఇబ్రహీంపురం, మాచాపురం తదితర గ్రామాల్లో హోలీ సంబరాలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్న పిల్లలు, పెద్దలు, యువతి యువకులు రంగులు కలిపిన నీటిని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. చిన్నారులు రంగు నీటిని బాటిళ్లలో పోసుకుని వీధుల్లో తిరిగుతూ స్నేహితులపై చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

కృష్ణగిరి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు వీధుల వెంట కేరింతలు కొడుతూ రంగు నీళ్లు చల్లుకున్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

గోనెగండ్ల: వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన పోలీస్ స్టేషన్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారు, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని 15 మందికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగంగా వాహనాలు నడుపరాదన్నారు. పెండింగ్ చలానాలు చెల్లించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే మహిళా సాధికారత



మాట్లాడుతున్న ఎంపీపీ జూటూరు హేమలత

చిప్పగిరి: రాష్ట్రంలో మహిళా సాధికారత వైఎస్సార్‌సీపీ తోనే సాధ్యమని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలుచేస్తోందని వివరించారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మ ఒడి, పొదుపు సంఘాల మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తూ వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా కృషి చేస్తున్నారన్నారు. సొంతిల్లు లేని కుటుంబాల్లో మహిళల పేరిట ఇంటి పట్టాలు మంజూరు చేసి వారి గౌరవాన్ని పెంచిందని గుర్తుచేశారు. గ్రామ సచివాలయాలలో మహిళా పోలీసులను నియమించడమే గాక మహిళల భద్రతకు దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. దేశంలో మహిళాభివృద్ధికి ఇంతలా పాటు పడుతున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగనన్నే అని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మారయ్య తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా శనగ కొనుగోళ్లు

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో చేపట్టిన శనగ దిగుబడుల కొనుగోళ్లను అవకతవకలు లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆలూరు డీసీఎంఎస్ ఇంచార్జ్ ప్రకాష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తూకాల్లో మోసాలు లేకుండా ఒక సంచికి 51.200 కేజీల చొప్పున (సంచి బరువు కలిపి) తూకం వేసి తీసుకుంటున్నామన్నారు. శనగలు జల్లెడ పట్టి, తూకం తర్వాత బస్తాలను లారీల్లో లోడు చేసేందుకు అయ్యే హమాలీ ఖర్చును మాత్రం రైతు భరించాల్సి ఉందన్నారు. గోనె సంచులు, లారీ రవాణా ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రణాళికలు

- రూ. 58.20 కోట్లతో వార్షిక బడ్జెట్
- రూ.13.67 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు



ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధికి రూ.58.20 కోట్లతో వార్షిక ప్రణాళికలు రూపొందించారు. ఇది ఇప్పటికే మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం పొందింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వార్షిక బడ్జెట్ అమల్లోకి వస్తుందని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. వార్షిక బడ్జెట్‌ను పరిశీలిస్తే 2023–24 సంవత్సరపు ప్రారంభ నిల్వ మొత్తం రూ.27,75,30,620 ఉంది. వివిధ పన్నుల రూపంలో వచ్చే సాధారణ జమ రూ.22,97,86,500, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే మూలధనపు జమ రూ.7,47,50,000 కలిపి మొత్తం బడ్జెట్ జమ అంచనాలు రూ.58,20,67,120లుగా ఉంది. అందులో వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాధారణ ఖర్చుల కింద రూ.15,61,42,200, మూలధనపు ఖర్చులు రూ.14,43,85,000, లోన్ చెల్లింపులు రూ.40,00,000 కలిపి మొత్తం ఖర్చులు రూ.30,45,27,200 ఉంటుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో ముగింపు నిల్వలుగా రూ.27,75,39,920లుగా చూపారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు మున్సిపాలిటీ సాధారణ నిధులు (జనరల్ ఫండ్స్) కలిపి మొత్తం రూ.13,67,85,000లతో మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

అభివృద్ధి పనులు ముమ్మరం



ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తుండటంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ఐదు నెలల్లో రూ.8 కోట్లకుపైగా పనులు జరిగాయి. 2023–24 వార్షిక బడ్జెట్‌లో కూడా రూ.13.67 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారుశుద్ధ్యం, పచ్చదనం పెంపు వంటి పనులకు ప్రాధాన్యతనిస్తూ అంచనాలు సిద్ధం చేశాం. సభ్యుల ఆమోదం కూడా తీసుకున్నాం.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

2023-24లో వివిధ గ్రాంట్ల కింద చేపట్టే అభివృద్ధి పనుల వివరాలు

వివరాలు	జనరల్ ఫండ్	కేంద్ర నిధులు	రాష్ట్ర నిధులు
రోడ్ల నిర్మాణం	రూ.1,00,00,000	రూ. 90,00,000	రూ.1,05,00,000
డ్రైన్స్,కల్వర్టులు	రూ.40,00,000	రూ.1,20,00,000	రూ.20,00,000
నీటిసరఫరా	రూ.45,35,000	--- --	రూ. 20,00,000
వీధిదీపాలు	రూ.65,00,000	---	----
పార్కులు,గార్డెనింగ్	రూ.20,00,000	రూ.25,00,000	--- ------
షాపింగ్‌కాంప్లెక్స్ మార్కెట్ల అభివృద్ధి	రూ.30,00,000	----	--------
శుభ్రత-ఆరోగ్యం	రూ.10,00,000	-----	రూ.70,00,000
మేజర్ డ్రైన్స్	రూ.60,00,000	రూ.1,50,00,000	రూ.10,00,000
కాంపౌండ్ వాల్స్	రూ.21,00,000	రూ.40,00,000	-------
కమ్యూనిటీ హాల్స్	రూ.96,00,000	----	---------
భవనాలు	రూ.2,06,00,000	---------	--------
ఇతర ఆస్తులు	రూ. 21,50,000	------	--------
ఇతరములు	రూ. 3,00,000	---------	--------
మొత్తం	రూ.7,17,85,000	రూ.4,25,00,000	రూ.2,15,00,000

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి



పట్టభద్రుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: వైఎస్సార్‌సీపీ తరఫున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక డీపీఏపీ కమ్యునిటీ హాలులో ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి చేపట్టాల్సిన ప్రచారం, తదితర అంశాలపై సూచనలిచ్చారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోళి సుధాకర్ గుండెపోటుతో మరణించడంపై సంతాపం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. విశాఖలో చేపట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం అయ్యిందని, రాష్ట్రంలో పెట్టబడులు పెట్టేందుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ఉత్సాహం చూపుతున్నారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని వివరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు వారి పరిసరాలలో ఉన్న పట్టభద్రులను కలిసి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, విద్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పన గురించి అవగాహన కల్పించి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసేలా కృషిచేయాలన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ అనితాయాదవ్, సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఎంపీటీసీ గద్దల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ నుంచి బరిలో ఉన్న అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు బుధవారం విస్తృత ప్రచారం చేపట్టారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప, రాజశేఖర్, సయ్యద్ చాంద్, ఖాశింబేగ్, వాహిద్, కేశవరెడ్డి, తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

వైభవంగా గరుడోత్సవం



గరుడ వాహనంపై సతీసమేతంగా దర్శనమిస్తున్న శ్రీవారు

మద్దికెర: పెరవలి గ్రామంలో కొలువైన శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామివారికి బిందెసేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుంచారు. అనంతరం పల్లకీలో గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో జనవాహిని మధ్య ఊరేగించారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, సిబ్బంది రఘు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



కోళ సుధాకర్ (ఫైల్)

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోళి సుధాకర్ (30) బుధవారం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శాంతన్న, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు సుధాకర్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. సుధాకర్ పార్టీ కోసం అహర్నిశలు పనిచేశాడని గుర్తు చేసుకున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం






మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మనోరంజని, అంగన్‌వాడీ టీచర్‌ను సత్కరిస్తున్న దృశ్యం, నందవరంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్టీయూ, యుటీఎఫ్, డీటీఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు నాగమణి, సుజాత మనోరంజని తదితరులు మహిళాభ్యుయంపై ప్రసంగించారు. ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్లు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొన్నారు. కండక్టర్లకు డిపో సీఐ నాగరాజు, ఎన్ఎంయుఏ కార్యదర్శి ముస్తక్ అహమ్మద్ బహుమతులు అందించారు. డిపో పరిధిలో ఉత్తమ సేవలందించిన కండెక్టర్ జయమ్మను జిల్లా కేంద్రంలో ఆర్ఎం వెంకటరామం ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. సీపీఐ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందిని పార్టీ నాయకులు ఈరమ్మ, వెంకటలక్ష్మి, కృష్ణవేణిలు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు, పట్టణ కార్యదర్శి రంగన్నలు ఘనంగా సన్మానించారు. స్థానిక మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్, నేషనల్ యాంటి కరెప్షన్ నాయకులు లాల్‌కోట్‌ఖదీర్, ముల్లా ఇస్మాయిల్‌ల ఆధ్వర్యంలో పట్టణంలో మొదటి బ్లడ్‌డోనర్ అయిన మల్లెల గ్రూప్స్ అధినేత ఆల్‌ఫ్రెడ్‌రాజు సతీమణి మల్లెల సునీలను ఘనంగా సన్మానించారు.

తుగ్గలి: అతివలు వంటింటికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరమ్మ, పర్యవేక్షణ డైరెక్టర్ హరినారాయణ, సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న అన్నారు. బుధవారం తుగ్గలి, జొన్నగిరిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్రమ్మ, సెక్రెడ్ సంస్థ సిబ్బంది, వెన్నెల మహిళా దివ్యాంగుల సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించేందుకు పోత్సాహం అందిస్తామని సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం సంస్థ కార్యాలయంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 10 మంది మహిళలకు కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యురాలు కల్పన, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కల్యాణికుమారి, మహిళా శిక్షకులను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

నందవరం: కనకవీడు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీఫ్ సంస్థ ప్రతినిధి ఉసేని ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆలూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో రిటైర్డ్ హెచ్ఎం ఎస్తేరమ్మ, ఎంపీపీ మెయిన్ స్కూల్ హెచ్ఎంలు మంజులా దేవిలను ఘనంగా సన్మానించారు.

హొళగుంద: మండలంలోని సీజనల్ హాస్టల్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు చిన్నహ్యాట నాగరాజు, ముస్లీం మైనార్టీ నాయకుడు అమీర్ సాబ్ పాల్గొని మహిళా సాధికారతపై ప్రసంగించారు.





తుగ్గలిలో మాట్లాడుతున్న ఆర్డీటీ ఆర్‌డీ రామేశ్వరమ్మ, పత్తికొండలో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న పి.మురళీధర్‌రెడ్డి, మాట్లాడుతున్న నాగరాజు

గంగవరంలో మారెమ్మ దేవర



మారెమ్మవ్వకు బోనాలు తీసుకెళుతున్న భక్తులు

నందవరం: డప్పు దరువులు, మేళతాళాల మధ్య గ్రామ దేవర ఘనంగా జరిగింది. పురవీధుల్లో బారులు తీరిన భక్తుల మధ్య కుంభోత్సవం కనువిందు చేసింది. బుధవారం మండల పరిధిలోని గంగవరంలో గ్రామ దేవత మారెమ్మవ్వ దేవర నిర్వహించారు. నూతన ఆలయంలో మారెమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి విశిష్ట పూజలు నిర్వహించారు. వేకువజామున గ్రామ దేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు చేపట్టారు. సంప్రదాయంలో భాగంగా అమ్మవారికి భోనాలు నైవేద్య సమర్పణ గావించారు. వేకువజామున బలిదానాలు కానిచ్చి ఉదయం కుంభోత్సవాలు నిర్వహించారు. డప్పుల దరువులతో అమ్మవారికి భక్తులు భోనాలు సమర్పించారు. ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి పిండి వంటలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బలిదానాలు కానిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దేవర ఉత్సవంలో సర్పంచ్ బైటిగేరి శివన్న, మాజీ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీ విజయ్‌మోహన్ రెడ్డి, గ్రామపెద్దలు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రహ్లాదరెడ్డి, వెంకట్రామిరెడ్డి, జయరామిరెడ్డి, రఘు, దస్తగిరి, రాజారెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

దేవరలో పొట్టేళ్ల పందేలు

మారెమ్మ దేవర పురస్కరించుకుని బుధవారం పొట్టేళ్ల పోటీ నిర్వహించారు. భక్తులు భోనాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా ఈ పోటీ నిర్వహించారు. పెద్ద పెద్ద పొట్టేళ్లతో సాగిన ఈ పోరు చూపరులను ఆకట్టుకుంది.

మహిళా సాధికారతతోనే మెరుగైన సమాజం



ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని సన్మానిస్తున్న మహిళా సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పత్తికొండటౌన్: మహిళా సాధికారతతోనే మెరుగైన సమాజం ఏర్పాటవుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఘనంగా నిర్వహించారు. పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని మహిళా సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళా సర్పంచులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. మహిళలు విద్యావంతులైతే వారి కుటుంబాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయన్నారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారాలని, ఆడ, మగ అనే వివక్ష లేకుండా పిల్లలందరినీ సమానంగా పెంచాలన్నారు. ఎంపీపీ నారాయణదాసు, సర్పంచులు ప్రవీణ, విజయలక్ష్మి, వాణిశ్రీ, అంజినయ్య, శ్రీరాములు, నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, జయచంద్రారెడ్డి, కారం నాగరాజు తదితరులు ఉన్నారు.

13న హుండీ ఆదాయం లెక్కింపు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథస్వామి దేవాలయంలోని హుండీ ఆదాయం లెక్కింపు ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటల నుంచి చేపట్టనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ నిబంధనల మేరకు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే వారు లుంగీ, కండువా ధరించి రావాలని సూచించారు.

గ్రామ సేవకురాలి మృతి

కృష్ణగిరి: మండలపరిధిలోని లక్కసాగరం గ్రామ సేవకురాలు ఎరుకలి మారెమ్మ (65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పురుషోత్తం గ్రామానికి చెరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈయన వెంట వీఆర్వోలు ప్రసాద్, గిడ్డయ్య ఉన్నారు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు.



ఈత సరదా

హోలీ పండుగ సందర్భంగా రెండు రోజులు సెలవులు రావడంతో బుధవారం ఆస్పరిలోని పెద్దబావిలో విద్యార్థులు ఈదులాడుతూ కేరింతలు కొట్టారు. కొంత మంది బావిలో మెట్లపై ఈత నేర్చుకుంటున్నారు. ఇటీవల సర్పంచ్ మూలింటి రాధమ్మ పెద్దబావిని పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించడంతో నీరు పుష్కలంగా ఉన్నాయి. వేసవి కావడంతో ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు విద్యార్థులు, యువకులు పెద్దబావిలో ఆనందంగా ఈత కొడుతున్నారు. –ఆస్పరి